

కానిస్టేబుల్ తుది రాతపరీక్ష

కానిస్టేబుల్ తుది రాత పరీక్ష ఆదిలాబాద్ జిల్లాలో ఆదివారం ఉదయం 10 నుంచి మధ్యాహ్నం ఒంటిగంట వరకు ప్రశాంతంగా నిర్వహించారు.

8లో▸



కల్యాణ ఘడియలు

శుభముహూర్తాలు వచ్చేశాయ్. ఈ నెల 3 నుంచి పెళ్లి భాజాభజంత్రీలు మోగనున్నాయి. మే, జూన్ మాసాల్లో 23 రోజులు మంచి ముహూర్తాలు ఉన్నాయి.

8లో▸

గరిష్టం/కనిష్టం
32.4 /22.4

వాతావరణం

ఆకాశం మేఘావృతమై ఉంటుంది. ఉష్ణోగ్రతలు సాధారణంకన్నా తక్కువగా నమోదవుతాయి. ద్రోణి ప్రభావంతో చాలా ప్రాంతల్లో వర్షం కురిసే అవకాశం ఉంది.

న్యూస్‌రీల్

ప్రశాంతంగా ఎంజేపీ ప్రవేశ పరీక్ష



పరీక్ష కేంద్రాన్ని పరిశీలిస్తున్న అదనపు కలెక్టర్

పాతమంచిర్యాల: జిల్లా కేంద్రంలో ఆదివారం నిర్వహించిన మహాత్మ జ్యోతిబాపూలే రెసిడెన్షియల్ ఇంటర్, డిగ్రీ కళాశాలల(ఆర్‌జేసీ/ఆర్‌డీసీ) ప్రవేశ పరీక్ష ప్రశాంతంగా జరిగిందని విద్యాసంస్థల జిల్లా కన్వీనర్ సేరు శ్రీధర్ తెలిపారు. ఇంటర్ ప్రవేశ పరీక్షకు 1,412 మంది, డిగ్రీలో ప్రవేశ పరీక్షకు 227 మంది విద్యార్థులు హాజరయ్యారని వివరించారు. జిల్లా కేంద్రంలో ఏర్పాటు చేసిన 8 పరీక్ష కేంద్రాలను అదనపు కలెక్టర్ మధుసూదన్‌నాయక్, అబ్జర్వర్ తిరుపతిరెడ్డి పరిశీలించారు.

ఇంధన పొదుపు పాటించాలి

- ఇండియన్ ఆయిల్ కార్పొరేషన్ డిప్యూటీ జనరల్ మేనేజర్ బాలాజీ



ర్యాలీలో పాల్గొన్న అధికారులు, డీలర్లు

పాతమంచిర్యాల: ఇంధన పొదుపు సూత్రాలను ప్రతి ఒక్కరూ పాటించాలని, ఇంధన వినియోగంపై అవగాహన కలిగి ఉండాలని ఇండియన్ ఆయిల్ కార్పొరేషన్ డిప్యూటీ జనరల్ మేనేజర్ బాలాజీ అన్నారు. జిల్లా కేంద్రంలో ఇంధన పొదుపు, పర్యావరణ పరిరక్షణపై సాక్షం 2023 పేరుతో అవగాహన ర్యాలీ ఆదివారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, ప్రతి ఒక్కరూ పర్యావరణ పరిరక్షణకు సహకరించాలన్నారు. ఇంధనాన్ని పొదుపుగా వినియోగిస్తూ దేశ ఆర్థికాభివృద్ధికి సహకరించాలని సూచించారు. కార్యక్రమంలో జిల్లా పౌరసరఫరాల అధికారి ప్రేంకుమార్, జిల్లా అగ్నిమాపక అధికారి దేవేందర్, ఇండియన్ ఆయిల్ కార్పొరేషన్ కరీంనగర్ 1 సేల్స్ అధికారి మహేశ్, ఇండేన్‌గ్యాస్ సీనియర్ డిస్ట్రిబ్యూటర్ ఆర్.సుభాష్‌రావు, జిల్లా ఇండేన్‌గ్యాస్ డిస్ట్రిబ్యూటర్లు, డెలివరీ బాయ్స్ పాల్గొన్నారు.

రాష్ట్రస్థాయి పోటీలకు విద్యార్థులు ఎంపిక



పోటీలకు ఎంపికైన విద్యార్థులు

బెల్లంపల్లి: రాష్ట్రస్థాయి జిజ్ఞాస పోటీలకు బెల్లంపల్లి ప్రభుత్వ డిగ్రీ కళాశాల విద్యార్థులు ఎంపికయ్యారు. జంతుశాస్త్రం, తెలుగు, ప్రభుత్వ పాలన శాస్త్రం, రసాయనశాస్త్రం, చరిత్ర, వృక్షశాస్త్ర విభాగాల నుంచి 28 మంది విద్యార్థులు పోటీలకు ఎంపికయ్యారు. హైదరాబాద్ కేంద్రంగా మే 1 నుంచి 3 వరకు పోటీలు జరుగనున్నాయి. వీరికి సూపర్ వైజర్లుగా ఆరుగురు అధ్యాపకులు వ్యవహరించనున్నట్లు ప్రభుత్వ డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ ఎం.గోపాల్ ప్రకటించారు. ఈ కార్యక్రమంలో వైస్ ప్రిన్సిపాల్ ప్రవీణ్‌కుమార్, అకాడమిక్ కోఆర్డినేటర్ శ్రీలత, జిజ్ఞాస కోఆర్డినేటర్ ఏకాంబరం, అధ్యాపకులు, సిబ్బంది పాల్గొన్నారు.

క్రీడలతోనే ఆరోగ్యం



క్రీడాకారులతో కనపర్తి రమేశ్

మంచిర్యాలక్రైం: క్రీడలతోనే ఆరోగ్యం సిద్ధిస్తుందని సిలంబం (కర్రసాము) అసోసియేషన్ రాష్ట్ర కార్యదర్శి కనపర్తి రమేశ్ అన్నారు. జిల్లా కేంద్రంలోని సెవెన్ హిల్స్ హైస్కూల్‌లో జరుగుతున్న రాష్ట్రస్థాయి సిలంబం శిక్షణ శిబిరం ఆదివారం ముగింపు కార్యక్రమానికి హాజరయ్యారు. అసోసియేషన్ రాష్ట్ర అధ్యక్షుడు రామ్మోహన్‌రావు, చైర్మన్ గోనె శ్యామ్‌సుందర్‌రావ్ సహకారంతో శిక్షణ శిబిరం నిర్వహించినట్లు తెలిపారు. జిల్లా ఉపాధ్యక్షుడు చకినాల శంకర్, రాజశేఖర్, కళ్యాణ్, గౌరి, సంతోష్, నరేష్, శృతి, వర్షిణి, రిచిత, మణిల పాల్గొన్నారు.

కాంట్రాక్టు అధ్యాపకులు ఇక పర్మినెంట్!



మంచిర్యాల జూనియర్ కళాశాల ఆవరణలో కాంట్రాక్టు లెక్చరర్లు (ఫైల్)

- క్రమబద్ధీకరణకు ప్రభుత్వం గ్రీన్‌సిగ్నల్
- 86 మంది అధ్యాపకులకు అవకాశం

మంచిర్యాలఅర్బన్: ప్రభుత్వ కళాశాలల్లో కాంట్రాక్టు ప్రాతిపదికన విధులు నిర్వహిస్తున్న అధ్యాపకులను ప్రభుత్వం ఎట్టకేలకు క్రమబద్ధీకరించింది. ఆదివారం సచివాలయం ప్రారంభోత్సవం సందర్భంగా కాంట్రాక్టు ఉద్యోగుల రెగ్యులరైజ్ ఫైల్‌పై సీఎం కేసీఆర్ సంతకం చేయడంతో కాంట్రాక్టు లెక్చరర్లలో ఆనందం వెల్లివిరుస్తోంది. జిల్లాలోని 10 ప్రభుత్వ జూనియర్ కళాశాలల్లో ఒకేషనల్ 15, జనరల్‌లో 71 మంది కలిపి మొత్తంగా 86 మంది అధ్యాపకులు విధులు నిర్వహిస్తున్నారు. రాష్ట్ర వ్యాప్తంగా 2,909 మంది జూనియర్ లెక్చరర్లను(జనరల్) రెగ్యులర్ చేయగా ఒకేషనల్‌లో మాత్రం 600కు పైగా ఉంటే 184 మందిని మాత్రమే క్రమబద్ధీకరించడం గందరగోళానికి గురిచేస్తోంది. ఇందులో ఒకేషనల్ అధ్యాపకులు ఎంతమంది రెగ్యులర్‌కు నోచుకుంటారనేది ప్రశ్నార్థకంగా మిగిలింది. జిల్లాలోని నాలుగు ప్రభుత్వ డిగ్రీ కళాశాలల్లో 30 మంది కాంట్రాక్టు అధ్యాపకులు విధులు నిర్వహిస్తున్నారు. ఇందులో పీజీ–55 శాతం, పీహెచ్‌డీ లేదా నెట్ (ఎన్‌ఈటీ) సెట్ (ఎస్‌ఈటీ) అర్హత ఉన్న వారిని పర్మినెంట్ చేసినట్లు తెలుస్తోంది. ఇందులో చెన్నూర్‌లో 8 మందిగానూ 1, లక్సెట్టిపేట్‌లో 8 మందికి గానూ 1, బెల్లంపల్లిలో 9 మందికిగానూ 5, మంచిర్యాలలో ఐదుగురు అధ్యాపకులకు ఇద్దరిని రెగ్యులర్ చేసినట్లు తెలుస్తోంది. కళాశాలల్లో రెగ్యులర్ ప్రక్రియ పూర్తయి అధ్యాపకుల జాబితా అధికారికంగా వెల్లడిస్తే తప్ప ఎంతమంది క్రమబద్ధీకరణకు నోచుకున్నారనేది తెలియదు.

క్రమబద్ధీకరణకోసం పాదయాత్ర

కాంట్రాక్టు లెక్చరర్లను రెగ్యులర్ చేస్తామని జీవో–16 అమలులోకి తీసుకువచ్చిన ముఖ్యమంత్రి కేసీఆర్ హామీని అమలు చేయలేదు. క్రమబద్ధీకరణకు ఎలాంటి ఆటంకాలు లేకుండా చూడాలని ప్రభుత్వ కళాశాలల కాంట్రాక్టు లెక్చరర్ల అసోసియేషన్–475 ఆధ్వర్యంలో 2022 డిసెంబర్ 10న సీఎం కేసీఆర్ నియోజకవర్గమైన గజ్వేల్ నుంచి కొయినాపల్లి వేంకటేశ్వరస్వామి ఆశీస్సుల కోసం పాదయాత్ర చేపట్టారు. కాంట్రాక్టు లెక్చరర్లను క్రమబద్ధీకరిస్తూ సీఎం నిర్ణయం తీసుకోవడం పట్ల ప్రభుత్వ జూనియర్ కళాశాలల ప్రిన్సిపాళ్ల సంఘం రాష్ట్ర కార్యదర్శి లక్ష్మణ్‌రావు హర్షం వ్యక్తం చేశారు. కాంట్రాక్టు లెక్చరర్ల సంఘం జిల్లా అధ్యక్షుడు నరేందుల రవీంద్రకుమార్ సీఎం కేసీఆర్, విద్యాశాఖ మంత్రి సబితా ఇంద్రారెడ్డితో పాటు పలువురికి ధన్యవాదాలు తెలిపారు.

అధ్యాపకుల విధులు ఇలా...

జిల్లాలో 86 మంది కాంట్రాక్టు అధ్యాపకులు విధులు నిర్వహిస్తున్నారు. 2000 సంవత్సరంలో మొదట రూ.3,700ల వేతనంతో విధుల్లోకి తీసుకున్నారు. అప్పట్లో 10 నెలలు మాత్రమే వేతనాలు చెల్లించారు. ఏటా జూన్‌లో విధుల్లో తీసుకుని మార్చిలో తొలగించడంతో దశలవారీగా ఆందోళన బాట పట్టారు. ఫలితంగా ప్రస్తుతం రూ.54 వేలతో పాటు 12 నెలల వేతనం చెల్లిస్తున్నారు.

సచివాలయ ప్రారంభోత్సవంలో మనోళ్లు





సంతకం చేస్తున్న మంత్రి ఐకేరెడ్డి, శుభాకాంక్షలు తెలుపుతున్న ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లా ప్రజాప్రతినిధులు

- మంత్రి ఐకేరెడ్డికి శుభాకాంక్షలు తెలిపిన ఉమ్మడి జిల్లా ప్రజాప్రతినిధులు, కలెక్టర్లు

నిర్మల్ టౌన్: హైదరాబాద్‌లోని బీఆర్ అంబేద్కర్ తెలంగాణ సచివాలయాన్ని శనివారం సీఎం కేసీఆర్ ప్రారంభించగా ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లాకు చెందిన పలువురు ప్రజాప్రతినిధులు, కలెక్టర్లు హాజరయ్యారు. నాలుగో అంతస్తులోని తన చాంబర్‌లో ఆసీనులైన రాష్ట్ర మంత్రి ఐకేరెడ్డికి పుష్పగుచ్ఛాలు అందించి శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా మంత్రి ఐకేరెడ్డి గ్రేటర్ హైదరాబాద్ పరిధిలోని నాలుగు జిల్లాల్లోగల 100 ఆలయాలకు ధూపదీప నైవేద్య పథకాన్ని వర్తింపజేసే.. ప్రధాన ఆలయాల్లో మిల్లెట్ ప్రసాదాన్ని అందుబాటులోకి తెచ్చే ఫైళ్లపై సంతకం చేశారు. మంత్రిని కలిసినవారిలో కలెక్టర్లు వరుణ్‌రెడ్డి, హేమంత్, బదావత్ సంతోష్, రాహుల్ రాజ్, ఎమ్మెల్సీ దండే విఠల్, ఎమ్మెల్యేలు రేఖా నాయక్, విఠల్‌రెడ్డి, జోగు రామన్న, రాథోడ్ బాపురావు, కోనేరు కోనప్ప, దుర్గం చిన్నయ్య, డీసీసీబీ మాజీ చైర్మన్ రాంకిషన్‌రెడ్డి, నిర్మల్ మున్సిపల్ చైర్మన్ గండ్రత్ ఈశ్వర్, బీఆర్ఎస్ యువ నాయకులు అల్లోల దివ్య, గౌతమ్‌రెడ్డి పాల్గొన్నారు.



మంత్రి ఐకేరెడ్డితో ఉమ్మడి జిల్లాలోని కలెక్టర్లు బదావత్ సంతోష్, రాహుల్‌రాజ్, వరుణ్‌రెడ్డి, హేమంత్

ప్రారంభించి వదిలేశారు!



పాత మంచిర్యాలలో రోడ్డు వెడల్పు పనుల కోసం తవ్వి వదిలేసిన రోడ్డు

- రూ.15 కోట్లతో రోడ్లు, డ్రెయినేజీ పనులు
- తవ్వి వదిలేస్తున్న కాంట్రాక్టర్లు
- అసంపూర్తి పనులతో ప్రజల అవస్థలు

మంచిర్యాలటౌన్: మంచిర్యాల మున్సిపాలిటీలో రోడ్ల వెడల్పు, డ్రెయినేజీ నిర్మాణం కోసం టీయూఎఫ్ఐడీసీ నుంచి రెండు నెలల క్రితం రూ.15 కోట్లు కేటాయించారు. ఈ నిధులతో పట్టణంలోని పలు వార్డుల్లో రోడ్లు, డ్రెయినేజీల నిర్మాణానికి అధికారులు, ప్రజాప్రతినిధులు రెండు నెలలుగా శంకుస్థాపన చేస్తున్నారు. ఈ పనులు దక్కించుకున్న కాంట్రాక్టర్లు పనులు మొదలు పెట్టి వదిలేస్తున్నారు. దీంతో ప్రజలు ఇబ్బంది పడుతున్నారు. రోడ్డు వెడల్పు కోసం రోడ్డు పక్కన ఉన్న మట్టిని తవ్వి వదిలేయడం, కంకర పోసి ఉంచడంతో వాహనాల రాకపోకలకు ఇబ్బందిగా మారుతోంది. రోడ్డు అభివృద్ధి పనులకు ముందుగానే తాగునీటి పైపులైన్ పనులు పూర్తిచేశారో లేదో చూసుకోకుండా, మిషన్ భగీరథ పనులు పూర్తి కాకుండానే హడావుడిగా అభివృద్ధి పనుల కోసం కొబ్బరికాయ కొట్టి రోడ్డును తవ్వి, పైపులైన్ పనుల పేరిట నిలిపివేయడంతో వాహనాల రాకపోకలకు ఇబ్బందిగా మారుతోంది. రెండు నెలల నుంచి పనులు ప్రారంభిస్తున్నా.. ఒక్క పని కూడా పూర్తి చేయలేదు. మరో నెలరోజుల తరువాత వర్షాలు పడే అవకాశం ఉంది. అప్పటిలోగా పనులను పూర్తి చేయకుంటే ప్రజలకు మరింతగా ఇబ్బందులు తప్పవు.

ప్రారంభించి.. నిలిపివేసి

మంచిర్యాల మున్సిపాలిటీ పరిధిలో ఫిబ్రవరి నెల నుంచి రూ.15 కోట్ల టీయూఎఫ్ఐడీసీ నిధులను కొన్ని వార్డుల్లోని రోడ్ల విస్తరణ, డ్రెయినేజీల నిర్మాణం కోసం కేటాయించారు.

- పాతమంచిర్యాల కమాన్ నుంచి గురిజాల రాజలింగం ఇంటి వరకు సీసీ రోడ్డు విస్తరణ, డ్రెయినేజీ నిర్మాణానికి రూ.1.30 కోట్లు కేటాయించారు. ఈమేరకు పనులు అట్టహాసంగా ప్రారంభించారు. రోడ్డుకు ఇరువైపులా తవ్వగానే మిషన్ భగీరథ పైపులు వేయాల్సి ఉందనడంతో, తాత్కాలికంగా కంకర పోసి వదిలేశారు. దీంతో వాహనదారులు ఇబ్బంది పడుతున్నారు.
- పాతమంచిర్యాలలోని సాయిబాబా గుడి నుంచి రంగంపేట వరకు సీసీ రోడ్డు విస్తరణ కోసం రూ.2.85 కోట్లు కేటాయించారు. ఫిబ్రవరి 25న పనులు ప్రారంభించారు. కానీ ఇప్పటి వరకు సగం పనులు కూడా పూర్తి చేయలేదు.
- ఐబీ చౌరస్తా నుంచి ఎంసీసీ వరకు డివైడర్ నిర్మించేందుకు రూ.1.71 కోట్లతో పనులు ప్రారంభించారు. అవి 20 శాతం కూడా పూర్తికాలేదు.
- హమాలీవాడ నుంచి తిలక్‌నగర్ వరకు 60 ఫీట్ల రోడ్డు వెడల్పు, డ్రెయినేజీ నిర్మాణం కోసం రూ.5.85 కోట్లతో పనులను ప్రారంభించారు. రోడ్డు విస్తరణ సమయంలో రోడ్డును ఆక్రమించి కట్టిన కొన్ని భవనాలను తొలగించక పోవడంతో, రోడ్డు విస్తరణ పనులకు ఆటంకంగా మారుతోంది. ప్రజాప్రతినిధుల ఒత్తిడితో కొన్ని భవనాలను కూల్చకుండా వదిలేసి, ఇతర ఇళ్లను 60 ఫీట్ల మేర కూల్చివేయడంతో డ్రెయినేజీ నిర్మాణం కష్టంగా మారి పనులు ముందుకు సాగడం లేదు.
- హమాలీవాడ సీఎస్ఐ చర్చి వద్ద రూ.2.8 కోట్లతో చేపట్టిన రోడ్డు పనులు నత్తనడకన సాగుతున్నాయి. సాయికుంట వద్ద రూ.1.60 కోట్లతో చేపట్టిన పనులు సగం కూడా పూర్తి చేయలేదు.

రోడ్లు, డ్రెయినేజీ పనులు పూర్తి కాకపోవడంతో వాహనాల రాకపోకలకు ఇబ్బందిగా మారింది. మిషన్ భగీరథ పనులు, రోడ్డు వెడల్పులో ఎదురవుతున్న ఆటంకాలను అధిగమిస్తేనే పనులు పూర్తయి, ప్రజలకు ఇబ్బందులు తొలగనున్నాయి.

పనులు పూర్తి చేసేలా చర్యలు



రోడ్ల విస్తరణ పనులను పూర్తి చేసేందుకు మిషన్ భగీరథ పైపులైన్, తాగునీటి పైపులు మార్చడం ఆటంకంగా మారుతోంది. కొన్నిచోట్ల పనులు వేగంగా పూర్తి చేస్తున్నాం. మే నెలలోనే రోడ్ల విస్తరణ, డ్రెయినేజీ పనులు పూర్తి చేసేలా చర్యలు తీసుకుంటాం.
– మధుకర్, మంచిర్యాల మున్సిపల్ ఇంజినీర్

అందిపుచ్చుకుంటే అవకాశాలెన్నో..!



డ్రైవింగ్ ఇనిస్టిట్యూట్ గది

- ఉమ్మడి జిల్లాకు నాలుగు డ్రైవింగ్ స్కూల్స్
- రెండేళ్ల క్రితమే అనుమతులు
- అభ్యర్థులు రాక ప్రారంభంకాని శిక్షణ
- కొరవడిన ప్రచారం

మంచిర్యాలఅర్బన్: మారుతున్న కాలంలో వాహనాల కొనుగోళ్లు పెరుగుతున్నాయి. కొత్తగా డ్రైవింగ్ నేర్చుకోవాలంటే కుటుంబ సభ్యులు, తెలిసిన వారి ద్వారా నేర్చుకుంటారు. లేదంటే డ్రైవింగ్ స్కూల్‌కు వెళ్తారు. ద్విచక్ర వాహనాలు, కార్లు నడపడం నేర్చుకునేందుకు ప్రత్యేకంగా డ్రైవింగ్ స్కూల్స్ ఉన్నాయి. మరి భారీ వాహనాలు నడపడం నేర్చుకోవాలంటే ఎంతో కట్టుదిట్టమైన శిక్షణ అవసరం. భారీ వాహనాల డ్రైవింగ్ నేర్పించే సంస్థలు అడపాదడపా ఉన్నా అందులో నైపుణ్యం కలిగిన శిక్షకులు అంతంతమాత్రంగానే ఉన్నారు. ఈ నేపథ్యంలో ఆర్టీసీ డిపోల్లో డ్రైవింగ్ స్కూల్స్ ఏర్పాటు చేసేందుకు ప్రభుత్వం నిర్ణయించింది. ఆదిలాబాద్, నిర్మల్, ఆసిఫాబాద్, మంచిర్యాలలో ఏర్పాటు చేసేందుకు రెండేళ్ల క్రితం అనుమతులు లభించాయి. ప్రచారలోపమో.. మరేదైనా కారణమో కానీ డ్రైవింగ్ స్కూల్‌కు ఆదరణ కరువైంది.

ఆర్టీసీలో తర్ఫీదుతో...

ఆర్టీసీ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన డ్రైవింగ్ స్కూల్‌లో సీనియర్ డ్రైవర్లు అభ్యర్థులకు శిక్షణ ఇవ్వనున్నారు. తద్వారా వాహనం నడపడంపై ఎన్నో మెలకువలు నేర్చుకునే అవకాశాలు ఉన్నాయి. డ్రైవింగ్ స్కూల్‌లో కండీషన్ ఉన్న వాహనం (ప్రత్యేక బస్సు)ద్వారా శిక్షణ ఇవ్వనున్నారు. థియరీ బోధనకు ప్రత్యేక గదులు ఏర్పాటు చేయడం ద్వారా తర్ఫీదు ఇవ్వనున్నారు. ఇక్కడ శిక్షణ పొందిన డ్రైవర్లకు ఆర్టీసీ సంస్థలో మొదట ప్రాధాన్యం కల్పిస్తారు. మరోవైపు ఆర్టీసీలో అద్దెబస్సుల సంఖ్య పెరుగుతూ వస్తోంది. శిక్షణ పొందిన డ్రైవర్లకు ఇలాంటి బస్సులు నడిపేందుకు అవకాశం కల్పిస్తారు. బయటి డ్రైవింగ్ స్కూల్స్‌లో వాహనాలు ఉన్నా శిక్షణ ఇచ్చేది తక్కువే. దీంతో లారీలు, ఇతర భారీ వాహనాలపై క్లీనర్‌గా వెళ్లి సొంతంగా నేర్చుకున్న వారిలో నైపుణ్యత లేకపోవడంతో ఉపాధి అవకాశాలు కూడా తక్కువగానే ఉంటాయి.

శిక్షణ విధానం ఇలా..

ఆర్టీసీ డ్రైవింగ్ స్కూల్‌లో ఉదయం 10 నుంచి సాయంత్రం 5 గంటల వరకు శిక్షణ కేంద్రం తెరిచి ఉంటుంది. శిక్షణ పొందే అభ్యర్థి రూ.15,500 రుసుం చెల్లించాల్సి ఉంటుంది. 18 ఏళ్ల వయస్సు పైబడిన వారు మాత్రమే శిక్షణకు అర్హులు. అభ్యర్థులు శారీరక ధారుఢ్యం కలిగిఉండాలి. లైట్ మోటార్ వెహికల్ లైసెన్స్ పొంది తప్పనిసరిగా ఏడాది పూర్తయి ఉండాలి. వెసులుబాటును బట్టి ఒక్కో అభ్యర్థికి 36 రోజుల పాటు శిక్షణ ఇస్తారు. మొత్తం 16 గంటలు థియరీ తరగతులు, 20 గంటలు క్షేత్రస్థాయిలో శిక్షణ ఇవ్వనున్నారు. ఆర్టీసీలో శిక్షణ తీసుకున్నవారికి అవకాశాలు మెండుగా ఉన్నాయి.

ప్రచార లోపంతోనే..

ఉమ్మడి జిల్లాలోని మంచిర్యాల, నిర్మల్, ఆసిఫాబాద్, ఆదిలాబాద్‌లో ఆర్టీసీ డ్రైవింగ్ స్కూల్ ఏర్పాటుకు అనుమతులు మంజూరయ్యాయి. ఇందులో ఆదిలాబాద్ మినహాయిస్తే ఎక్కడా అభ్యర్థుల నుంచి స్పందన కరువైంది. ఆర్టీసీ డ్రైవింగ్ స్కూల్ ఏర్పాటు అవకాశాలపై విస్తృతంగా ప్రచారం లేకపోవడమే ఇందుకు కారణంగా తెలుస్తోంది. ఆర్టీసీలో డ్రైవింగ్ శిక్షణ కేంద్రం ప్రారంభం కావాలంటే ఒక బ్యాచ్‌లో 16 మంది అవసరం. ఆసక్తి కలిగిన అభ్యర్థులు దరఖాస్తు చేసుకుంటే శిక్షణ షురూ చేస్తారు. ఇప్పటికైనా ఆర్టీసీ అధికారులు స్పందించి మోటర్ డ్రైవింగ్ స్కూల్‌పై ప్రచారం నిర్వహించాల్సిన అవసరం ఎంతైనా ఉంది.

ప్రచారం నిర్వహిస్తాం

ఆర్టీసీ డ్రైవింగ్ స్కూల్‌పై విస్తృతంగా ప్రచారం నిర్వహిస్తాం. అభ్యర్థుల నుంచి దరఖాస్తులు వస్తే శిక్షణ ప్రారంభిస్తాం. ఆర్టీఏ నిబంధనల మేరకు ప్రత్యేక గదులు ఏర్పాటు చేశాం. శిక్షణకు అవసరమైన ప్రత్యేక బస్సు అందుబాటులో ఉంది.
– రవీంద్రనాథ్, డీఎం, మంచిర్యాల

గుడిపేటలోనే మెడికల్ కళాశాల



గుడిపేటలో మెడికల్ కళాశాల వెళ్లే రహదారి సర్వేలో ఇంజినీరింగ్ అధికారులు

మంచిర్యాలరూరల్(హాజీపూర్): మంచిర్యాల మెడికల్ కళాశాలకు ఎట్టకేలకు స్థలం ఖరారైంది. హాజీపూర్ మండలం గుడిపేటలోనే కళాశాల ఏర్పాటు చేయాలని ప్రభుత్వం నిర్ణయించింది. ఇందుకు 32 ఎకరాల స్థలం ఎంపిక చేశారు. తాజాగా రోడ్లు, భవనాల శాఖ ఈఈ రాములు పర్యవేక్షణలో మెడికల్ కళాశాలకు కేటాయించిన స్థలంలో విస్తృతంగా సర్వే జరుపుతున్నారు. ఆదివారం ఆర్అండ్‌బీ ఆధ్వర్యంలోని ఎస్ఎస్ ఇన్‌ఫ్రాస్ట్రక్చర్ ప్రాజెక్ట్ కన్సల్‌టెంట్ ప్రైవేట్ లిమిటెడ్(ఎస్ఐపీసీపీఎల్) కంపెనీ ఆధ్వర్యంలో సీనియర్ ఇంజినీర్ విద్యాసాగర్ సర్వే చేశారు. భవన నిర్మాణానికి సంబంధించి మట్టి పరీక్ష మొదలు వివిధ భవన నిర్మాణాలకు సబంధించి డిజైన్లు, ఎస్టిమేషన్లు, రోడ్ల ఏర్పాటు, విద్యుత్ తదితర అన్ని అంశాలపై పూర్తి సర్వే నివేదిక ఈ కంపెనీ మెడికల్ కళాశాలకు అందజేయనుంది.

సాక్షి కథనాలతో ఖరారు..

హాజీపూర్ మండలం గుడిపేటకు మెడికల్ కళాశాల ఏర్పాటుపై 'సాక్షి'లో పలుమార్లు కథనాలు ప్రచురించాం. ఈ కథనాల ఆధారంగానే స్థానిక ఎమ్మెల్యేలు, ప్రజాప్రతినిధులు స్థలం కేటాయింపు కోసం ప్రభుత్వంపై ఒత్తిడి తెచ్చారు. గుడిపేటలో మెడికల్ కళాశాల నిర్మించాలని సీఎం కేసీఆర్, మంత్రులు హరీశ్‌రావు, కేటీఆర్‌కు విన్నవించారు. చివరకు స్థలం ఖరారు చేశారు.

వీడని మబ్బులు..ఆరని ధాన్యం



ధాన్యం కుప్ప చేస్తున్న రైతులు

దండేపల్లి(మంచిర్యాల): అకాల వర్షాలతో ఆకాశం మేఘవృతంగా ఉంటోంది. దీంతో ధాన్యం సరిగా ఆరడం లేదు. ధాన్యం విక్రయించాలంటే తేమశాతం 17 లోపు ఉండాలి. ధాన్యంలో తేమశాతం తగ్గించేందుకు మండలంలోని పలు గ్రామాల్లోని రైతులు కల్లాలు, కొనుగోలు కేంద్రాల్లో ధాన్యం ఆరబోస్తున్నారు. కొద్దిపాటిగా ఎండవస్తే ఆరబోయడం, మబ్బువస్తే కుప్పచేసి కవర్లు కప్పుతున్నారు.

మంత్రి హరీశ్‌రావును కలిసిన తోట శ్రీనివాస్



మంత్రి హరీశ్‌రావుకు జ్ఞాపిక అందజేస్తున్న తోట శ్రీనివాస్

పాతమంచిర్యాల: తెలంగాణ రాష్ట్ర నూతన సచివాలయం ప్రారంభోత్సవాన్ని పురస్కరించుకుని జిల్లా కేంద్రంలోని మారుతినగర్ లయన్స్ క్లబ్ అధ్యక్షుడు తోట శ్రీనివాస్ ఆదివారం మంత్రి హరీశ్‌రావును కలిసి శుభాకాంక్షలు తెలిపారు. హైదరాబాద్‌లో మంత్రిని కలిసి జ్ఞాపికను అందజేశారు.

సేంద్రియ వ్యవసాయ ఉత్పత్తుల ప్రదర్శన



ప్రదర్శన ప్రారంభిస్తున్న డీఏవో కల్పన

మంచిర్యాల అగ్రికల్చర్ : జిల్లా కేంద్రంలోని వైశ్యభవన్‌లో సేంద్రియ వ్యవసాయ ఉత్పత్తుల ప్రదర్శన ఆదివారం ఏర్పాటు చేశారు. మున్సిపల్ చైర్మన్ పెంట రాజయ్య, జిల్లా వ్యవసాయాధికారి కల్పన ప్రదర్శనను ప్రారంభించి మాట్లాడారు. రసాయన ఎరువులు వాడకుండా సేంద్రియ పద్ధతిలో పంటలు పండించి ప్రదర్శనలు ఏర్పాటు చేయడం అభినందనీయమన్నారు. ఈ ప్రదర్శనలో ఉంచిన మామిడి, చిరుధాన్యాలు, బియ్యం, పప్పులు, కారం, గానుగ నూనెలు, తేనె బెల్లం, కూరగాయలు, పూజాసామగ్రి స్టాళ్లను పరిశీలించారు. కార్యక్రమంలో సేంద్రియ వ్యవసాయ ఉత్పత్తిదారుల సంఘం జిల్లా కన్వీనర్ బొడ్డు శంకర్, అత్తి సరోజ, కేవీ.ప్రతాప్, గోనే శ్యాంసుందర్‌రావు, రైతులు పాల్గొన్నారు.

గాలివాన బీభత్సం

మంచిర్యాలరూరల్(హాజీపూర్): పట్టణంలో ఆదివారం సాయంత్రం కురిసిన గాలివాన బీభత్సం సృష్టించింది. జాతీయ రహదారిపై చెట్లు విరిగిపడడంతో వాహనాల రాకపోకల కు ఆటంకం ఏర్పడింది. విద్యుత్ తీగలు తెగిపడ్డాయి. వేంపల్లి, గుడిపేట, ముల్కల్ల, రాపల్లి, హాజీపూర్, దొనబండ గ్రామాల్లో పడిపోయిన చెట్లను ఎస్సై నరేశ్ తొలగింపజేశారు.



రాపల్లి జాతీయ రహదారిపై విరిగిపడిన చెట్లు

క్లుప్తంగా

రోడ్డు ప్రమాదంలో పలువురికి గాయాలు



వాంకిడి: ఆటో బోల్తాపడి పలువురికి గాయాలైన సంఘటన శనివారం రాత్రి చోటుచేసుకుంది. ఎస్సై సాగర్ వివరాల ప్రకారం... శనివారం రాత్రి వాంకిడి వైపు నుంచి ఆసిఫాబాద్ వైపునకు వెళ్తున్న కారును ఆసిఫాబాద్ వైపు నుంచి వాంకిడి వైపునకు వస్తున్న ఆటో మండల కేంద్రంలోని సరాండి ఎక్స్‌రోడ్డు సమీపంలో రహదారిపై అదుపు తప్పి కారును ఢీకొంది. ఆటో డ్రైవర్‌కు స్వల్ప గాయాలు కాగా, ఆసిఫాబాద్ మండలం వెంకటాపూర్ గ్రామానికి చెందిన వైరగడె రాజేశ్వర్, బలంపూర్ గ్రామానికి చెందిన వెడమ రాజేశ్వర్‌కు తీవ్ర గాయాలయ్యాయి. వారిని జిల్లా కేంద్రంలోని ఆస్పత్రిలో చేర్పించారు. ప్రమాదానికి సంబంధించిన ఫిర్యాదు అందలేదని పోలీసులు తెలిపారు.

ప్రాణం తీసిన మద్యం మత్తు

మందమర్రిరూరల్: మందమర్రి పోలీస్‌స్టేషన్ పరిధిలోని ఊరు రామకృష్ణాపూర్ రోడ్డులోని ఎమ్మెల్యే కాలనీలో మద్యం మత్తులో కింద పడి ఆవునూరి శ్రీనివాస్ (36) మృతి చెందాడు. ఎస్సై చంద్రకుమార్ వివరాల ప్రకారం... ఎమ్మెల్యే కాలనీలోని శ్రీనివాస్ మద్యం మత్తులో ఇంటికి సమీపంలో అదుపు తప్పి సిమెంట్ రోడ్డుపై పడడంతో తలకు తీవ్రమైన గాయమై అక్కడికక్కడే మృతి చెందాడు. మృతుడి కటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు.

నూతన కమిటీ ఎన్నిక



ఎన్నికైన నూతన కమిటీ సభ్యులు

శ్రీరాంపూర్: సింగరేణి ఎస్సీ, ఎస్టీ ఎంప్లాయిస్ వెల్ఫేర్ అసోసియేషన్ ఆర్కే 6 గని నూతన ఫిట్ కమిటీని ఎన్నుకున్నారు. ఆదివారం గనిపై జరిగిన ఫిట్ కమిటీ జనరల్ బాడీ సమావేశంలో నూతన కమిటీని ఎన్నుకున్నారు. ఫిట్ కమిటీ సెక్రెటరీగా కడమండ యూసఫ్, అసిస్టెంట్ ఫిట్ సెక్రెటరీగా అయిందాల కిశోర్, జనరల్ షిఫ్ట్ ఇన్‌చార్జిగా నాగరాజు, ట్రెజరర్‌గా నవీన్, ఏ రిలే ఇన్‌చార్జిగా కోల రాజు, బీ రిలే ఇన్‌చార్జిగా రాఘవేంద్ర, సీ రిలే ఇన్‌చార్జిగా రిషిదేవ్‌లను ఎన్నుకున్నారు. అసోసియేషన్ బ్రాంచీ కన్వీనర్ డేగల ప్రవీణ్‌కుమార్, కో కన్వీనర్ రెడపాక లక్ష్మణ్, చీఫ్ ఆర్గనైజింగ్ సెక్రెటరీ వేల్పుల ప్రవీణ్, జాయింట్ సెక్రెటరీలు కుక్క శ్రీనివాస్, అందె వెంకటేశ్, సుందిళ్ల నరేశ్, అడ్వైయిజర్‌గా లక్ష్మీనారాయణ, రాజలింగు, దాసు పాల్గొన్నారు.



23ఏళ్ల తర్వాత మళ్లీ బడికి

దండేపల్లి: వారంత 23ఏళ్ల క్రితం అదే పాఠశాలలో పదో తరగతి వరకూ కలిసి చదువుకున్నారు. ఉన్నత చదువుల నిమిత్తం విడిపోయారు. పూర్వ విద్యార్థుల సమ్మేళనంతో ఒకే వేదికపై కనిపించారు. దండేపల్లి జెడ్పీ ఉన్నత పాఠశాలలో 1999-2000 విద్యా సంవత్సరంలో పదో తరగతి చదివిన పూర్వ విద్యార్థులు ఆదివారం అదే పాఠశాలలో మళ్లీ కలుసుకున్నారు. విద్యాబుద్ధులు నేర్పించిన గురువులను సైతం ఆహ్వానించి సన్మానించారు. 23ఏళ్ల తర్వాత చిన్ననాటి మిత్రులు ఒకే చోట కలుసుకోవడంతో వారి ఆనందాలకు అవధులు లేకుండా పోయాయి.



అపూర్వ కలయిక

జన్నారం: మండలంలోని తపాలపూర్ ప్రభుత్వ ఉన్నత పాఠశాల 2002-2003 బ్యాచ్‌కు చెందిన పూర్వ విద్యార్థుల సమ్మేళనం ఆదివారం నిర్వహించారు. 20 ఏళ్ల తరువాత అందరూ ఒకేచోట కలుసుకుని ఆనందంగా గడిపారు. అప్పట్లో బోధించిన ఉపాధ్యాయులతో పాటు ప్రస్తుత హెచ్‌ఎం తిరుపతిని సన్మానించారు.

ప్రశాంతంగా కానిస్టేబుల్ తుది రాతపరీక్ష

- ఆదిలాబాద్‌లో 12 పరీక్ష కేంద్రాల ఏర్పాటు
- 4768 మంది అభ్యర్థుల హాజరు
- పరీక్ష కేంద్రాలను పరిశీలించిన ఎస్పీ



పరీక్ష కేంద్రం వద్దకు చేరుకున్న అభ్యర్థులు

ఆదిలాబాద్‌టౌన్: కానిస్టేబుల్ తుది రాత పరీక్ష ఆదివారం ప్రశాంతంగా జరిగింది. ఉదయం 10 నుంచి మధ్యాహ్నం 1 గంట వరకు పరీక్ష జరిగింది. పరీక్షకు నిమిషం ఆలస్యం నిబంధన ఉండడంతో ఆయా ప్రాంతాల నుంచి అభ్యర్థులు ముందుగానే కేంద్రాలకు చేరుకున్నారు. అయితే ఉదయం 6 గంటల సమయంలో వర్షం కురవడంతో అభ్యర్థులు కొంత ఇబ్బందులు ఎదుర్కొన్నారు. దాదాపు గంటకు పైగా భారీ వర్షం కురవడంతో వారు కొంత ఆందోళనకు గురయ్యారు. వర్షం తగ్గుముఖం పట్టడంతో ఊపిరి పీల్చుకున్నారు. ఆదిలాబాద్ జిల్లా కేంద్రంలో 12 పరీక్ష కేంద్రాలు ఏర్పాటు చేశారు. 4820 మంది హాజరు కావల్సి ఉండగా, 4768 మంది హాజరయ్యారు. 52 మంది అభ్యర్థులు గైర్హాజరయ్యారు. ఎస్పీ ఉదయ్‌కుమార్ రెడ్డి పరీక్ష కేంద్రాలను పరిశీలించారు. కేంద్రాల పరిసర ప్రాంతాల్లో 144 సెక్షన్ అమలు చేశారు. డీఎస్పీ, సీఐ, ఎస్సైల ఆధ్వర్యంలో కేంద్రాల వద్ద పర్యవేక్షణ కొనసాగింది. పోలీసులు బందోబస్తు చేపట్టారు.

పోలీసు వాహనాల్లో పరీక్ష కేంద్రాల వరకు..

ఆదిలాబాద్‌లో భారీ వర్షం కురవడంతో దూర ప్రాంతాల నుంచి వచ్చిన అభ్యర్థులు ఇబ్బందులు పడ్డారు. ఆయాచోట్ల అభ్యర్థులను గమనించిన పోలీసు పెట్రోలింగ్ సిబ్బంది వారిని వాహనాల్లో కేంద్రాల వరకు తరలించారు. ఇదిలా ఉండగా జిల్లా నలుమూలల నుంచి అభ్యర్థులు రావడంతో పట్టణమంతా సందడిగా మారింది. బస్టాండ్ ప్రాంతం వారితో కిటకిటలాడింది. చిన్న పిల్లలతో పరీక్ష కేంద్రానికి వచ్చిన మహిళ అభ్యర్థులు కొంత ఇబ్బందులకు గురయ్యారు. చిన్న పిల్లలను పరీక్ష కేంద్రం లోనికి అనుమతించక పోవడంతో పరీక్ష అయ్యే వరకు వారి బంధువులు పిల్లల్ని ఆడిస్తూ కనిపించారు.



చిన్నారిని ఆడిస్తున్న మహిళ



కేంద్రాన్ని పరిశీలిస్తున్న ఎస్పీ ఉదయ్‌కుమార్‌రెడ్డి



అభ్యర్థులను కేంద్రానికి తరలిస్తున్న పోలీసులు

కల్యాణ ఘడియలు

- ఈనెల 3 నుంచి మోగనున్న భాజాభజంత్రీలు
- మే, జూన్ నెలల్లో 23 మంచి రోజులు



ఈవెంట్ ఆర్గనైజర్లు, ఫొటోగ్రాఫర్లు, వ్యాపారులు తదితరులు సంతోషం వ్యక్తం చేస్తున్నారు.

నిర్మల్‌చైన్‌గేట్: శుభముహూర్తాలు వచ్చేశాయి. గురు మూఢం కారణంగా ఏప్రిల్ నెలలో పెళ్లిళ్లకు శుభముహూర్తాలు లేవు. ఈనెల 3న బుధవారం నుంచి పెళ్లి భాజాభజంత్రీలు మోగనున్నాయి. జిల్లాలో పెళ్లి సందడి నెలకొంది. దుకాణాలు కొనుగోలుదారులతో కళకళలాడనున్నాయి. పెళ్లి మండపాలు ముస్తాబవుతున్నాయి. శుభలేఖల ప్రింటింగ్ పనులు పూర్తి కాగా, వంటవారు, భాజాభజంత్రీల వారు, పురోహితులు అంతా సిద్ధమవుతున్నారు.

శుభముహూర్తాలు ఇలా..

ఈనెల 3 నుంచి వరుసగా 4, 5, 6, 7, 8, 10, 11, 12, 13, 21, 26, 27, 28, 30, 31, జూన్‌లో 1, 3, 7, 8, 9, 10, 11 తేదీల్లో ముహూర్తాలు ఉన్నాయి. ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా వేల సంఖ్యలో శుభకార్యాలు జరగనున్నాయి. జూన్ 19 నుంచి ఆషాఢమాసం మొదలై, జులై మొత్తం అధిక శ్రావణం కావడంతో ఆగస్టు 18 వరకు ముహూర్తాలు లేవు. తిరిగి ఆగస్టు 19న మంచిరోజులు ప్రారంభమై డిసెంబర్ 31 వరకు ఉన్నాయి.

రద్దీగా దుకాణాలు

ఈనెల 3 నుంచి పెళ్లిళ్ల నేపథ్యంలో బంగారు, వస్త్ర దుకాణాలు రద్దీగా మారాయి. నిర్వాహకులు ఇప్పటికే అన్ని ఫంక్షన్ హాళ్లు ముందస్తుగా బుక్ అయ్యాయి. ఈసారి అధికంగా ముహూర్తాలు ఉండటంతో నిశ్చితార్థం నుంచి పెళ్లి వరకు మొత్తం 25 రంగాల వారికి చేతినిండా ఉపాధి ఉండనుంది. వేద బ్రాహ్మణులు, బ్యాండ్ మేళం, సౌండ్ సిస్టమ్, లైటింగ్, డెకరేషన్, క్యాటరింగ్, వంటలు చేసేవారు,

రెండునెలల్లో మంచి రోజులు



ఏప్రిల్‌లో ముహూర్తాలు లేవు. మే, జూన్ నెలలో 23 మంచిరోజుల్లో పెళ్లిళ్లు జరగనున్నాయి. జులైలో మంచి రోజులు లేవు. ఆగస్టు 19 నుంచి మంచి రోజులు ప్రారంభమై డిసెంబర్ 31 వరకు ఉన్నాయి.

– పట్వారీ శ్రీనివాస్, ఆలయ పూజారి

క్రీడల నిర్వహణకు సింగరేణి ప్రోత్సాహం



క్రికెట్ పోటీలు ప్రారంభిస్తున్న జీఎం మోహన్‌రెడ్డి

బెల్లంపల్లి: క్రీడా పోటీల నిర్వహణకు సింగరేణి యాజమాన్యం తగిన ప్రోత్సాహం అందిస్తుందని మందమర్రి ఏరియా సింగరేణి జనరల్ మేనేజర్ జి.మోహన్ రెడ్డి తెలిపారు. బెల్లంపల్లి పట్టణంలోని ఏఎంసీ క్రీడా మైదానంలో ఆదివారం ఏర్పాటు చేసిన బీపీఎల్ ప్రీమియర్ లీగ్ ఫర్ వెటరన్ లెజెండ్స్ టీ–20 క్రికెట్ పోటీలను జీఎం ముఖ్య అతిథిగా హాజరై ప్రారంభించారు. ముందుగా క్రీడాకారులను పరిచయం చేసుకుని క్రికెట్ పోటీలను ప్రారంభించారు. అనంతరం ఏర్పాటు చేసిన కార్యక్రమంలో జీఎం మాట్లాడారు. బెల్లంపల్లి పట్టణం క్రీడా పోటీలకు పుట్టినిల్లన్నారు. సింగరేణిలో పని చేసి ఎందరో క్రీడాకారులుగా ఎదిగారన్నారు. ఉద్యోగ విరమణ చేసిన క్రీడాకారులను ప్రోత్సహించేందుకు క్రికెట్ పోటీలను నిర్వహించడం అభినందనీయమన్నారు. బెల్లంపల్లిలో ఎప్పుడు క్రీడా పోటీలు నిర్వహించినా తనవంతు సహకారం అందిస్తానని స్పష్టం చేశారు. వయస్సుతో సంబంధం లేకుండా ఉత్సాహంగా క్రీడలు ఆడి ఆరోగ్యంగా జీవించాలని కోరారు. ప్రతి ఒక్కరూ క్రీడలను జీవితంలో భాగం చేసుకోవాలని సూచించారు.

విజేతగా సోని టీమ్

క్రికెట్ పోటీల్లో పలు టీమ్‌లు పాల్గొన్నాయి. ఫైనల్ మ్యాచ్ నల్గొండ, బెల్లంపల్లి సోని టీమ్‌ల మధ్య హోరాహోరీగా సాగింది. ఆధిపత్యం కనబరిచి నల్గొండ టీమ్‌పై సోని టీమ్ విన్నర్స్‌గా నిలిచింది. విజేతగా నిలిచిన సోనీ టీమ్‌కు రిటైర్డ్ సీబీసీఐడీ అడిషనల్ ఎస్పీ పి.రవికుమార్ ట్రోఫీని అందజేశారు. కార్యక్రమంలో క్రికెట్ పోటీల ఆర్గనైజర్లు ఖలీం పాషా, సంపత్‌రెడ్డి, సింగరేణి రిటైర్డు జీఎంలు హసన్ అబ్బాస్, సూర్యదాస్, రిటైర్డు డీవైజీఎం జె.కిరణ్‌కుమార్, సీనియర్ పర్సనల్ మేనేజర్ రామకృష్ణ, సీనియర్ క్రీడాకారులు టి.పోచన్న, డగ్లస్ విన్సెంట్, సలీం, శేఖర్, ఆర్.తిరుపతిరెడ్డి, దిలీప్‌కుమార్ పాల్గొన్నారు.

శ్రమ శక్తి అవార్డుకు ఎంపిక



కే సురేందర్‌రెడ్డి



పెట్టం లక్ష్మణ్



పానుగంటి సత్తయ్య

శ్రీరాంపూర్: రాష్ట్ర కార్మిక శాఖ ప్రతీ మేడే సందర్భంగా అందించే శ్రమశక్తి అవార్డుకు ఈసారి శ్రీరాంపూర్ డివిజన్ నుంచి ముగ్గురు కార్మిక వర్గ నేతలు ఎంపికయ్యారు. టీబీజీకేఎస్ బ్రాంచీ ఉపాధ్యక్షుడు కేతిరెడ్డి, జీఎం చర్చల కమిటీ ప్రతినిధి పెట్టం లక్ష్మణ్, ఏరియా కార్యదర్శి పానుగంటి సత్తయ్య, ఆర్‌కె 5 మైనింగ్ సర్దార్ శ్రీనివాస్‌రావును ఎంపిక చేశారు. వీరిలో సురేందర్‌రెడ్డి ఎస్సార్పీ 3 గనిలో డెప్యూటీ సూపరింటెండెంట్‌గా పని చేసి 2023 ఫిబ్రవరీలో రిటైర్డ్ అయ్యాడు. పెట్టం లక్ష్మణ్ ఎస్సార్పీ 1 గనిలో సీనియర్ అసిస్టెంట్‌గా పని చేస్తున్నారు. పానుగంటి సత్తయ్య ఆర్కే 6 గనిలో ఎలక్ట్రీషియన్ ఫిట్టర్‌గా పని చేసి 2019 రిటైర్డ్ అయ్యాడు. రాష్ట్ర స్థాయి శ్రమ శక్తి అవార్డుకు వీరు ఎంపిక కావడంపై టీబీజీకేఎస్ శ్రేణులు హర్షం వ్యక్తం చేశాయి. రాష్ట్ర కార్మిక శాఖ ఆధ్వర్యంలో సోమవారం హైదరాబాద్‌లోని రవీంద్రభారతిలో జరిగే మేడే వేడుకల్లో కార్మికశాఖ మంత్రి మల్లారెడ్డి, ఇతర అధికారుల చేతుల మీదుగా ఈ అవార్డులను వీరికి ప్రదానం చేయనున్నారు.

మందమర్రి ఏరియా నుంచి

మందమర్రిరూరల్: మందమర్రి ఏరియాలో నలుగురికి శ్రమశక్తి అవార్డుకు ఎంపికయ్యారు. టీబీజీకేఎస్ యూనియన్ నాయకులు జీడి బాబు, బాబురావు, ఈశ్వర్, శంకర్‌రావు 'మే' డే సందర్భంగా మంత్రి చేతుల మీదుగా అవార్డు అందుకోనున్నారు.





జంటహత్యల కలకలం

- గుడిహత్నూర్ శివారులో మృతదేహాలు
- ఆదిలాబాద్ జిల్లా కేంద్రానికి చెందిన రహమాన్, వివాహిత అశ్వినిగా గుర్తింపు..



రహమాన్, అశ్విని మృతదేహాలు

గుడిహత్నూర్: ఆదిలాబాద్ జిల్లా గుడిహత్నూర్ మండలం సీతాగోంది పంచాయతీ పరిధిలోని గర్కంపేట సమీపంలో లభ్యమైన జంట మృతదేహాలు ఆదివారం కలకలం రేపాయి. కుళ్లిపోయే దశలో చేనులో పడి ఉన్న మృతదేహాలను స్థానికులు గుర్తించి పోలీసులకు సమాచారం అందించగా విషయం వెలుగులోకి వచ్చింది. సమాచారం అందుకున్న ఎస్పీ ఉదయ్‌కుమార్ రెడ్డి, ఉట్నూర్ డీఎస్పీ నాగేందర్ అక్కడికి చేరుకొని దర్యాప్తు చేపట్టారు. మృతుల తలలు తీవ్రంగా గాయపరిచి హత్య చేసినట్లుగా ప్రాథమికంగా నిర్ధారించారు.

హత్యకు గురైంది వీరే..

ఘటనాస్థలం సమీపంలోని బీటీరోడ్డుపై నిలిచిన ఉన్న స్కూటీని పరిశీలించిన పోలీసులు వాహన నంబర్ ఆధారంగా ఆదిలాబాద్ జిల్లా కేంద్రంలోని భుక్తాపూర్‌కు చెందిన మహమ్మద్ రహమాన్ (20)గా, సుందరయ్యనగర్‌కు చెందిన వివాహిత సోన్‌కాంబ్లే అశ్విని (28)గా గుర్తించారు. మృతదేహాలను పోస్టుమార్టం నిమిత్తం రిమ్స్‌కు తరలించి కేసు దర్యాప్తు చేస్తున్నట్లు సీఐ సైలు, ఎస్సై ప్రవీణ్‌కుమార్ తెలిపారు.

క్లూస్‌టీం, డాగ్ స్క్వాడ్‌తో..

మృతులిద్దరూ ఒకే రకమైన దెబ్బలతో చనిపోవడంతో హత్యగా భావించిన పోలీసులు క్లూస్ టీంతో పాటు డాగ్ స్క్వాడ్‌ను రప్పించి దర్యాప్తు చేపట్టారు. మృతదేహాలు కుళ్లిపోయే స్థితిలో ఉండడంతో రెండురోజుల క్రితం ఘటన జరిగి ఉండవచ్చని భావిస్తున్నారు.

అక్రమ సంబంధమే హత్యలకు దారితీసిందా..?

రహమాన్, అశ్వినిల హత్య వెనుక కారణాలపై మండలంతో పాటు జిల్లా కేంద్రంలో చర్చనీయాంశమైంది. మహమ్మద్ రహమాన్ తన బాబాయికి చెందిన ఆర్టీఏ ఏజెంట్ కార్యాలయంలో ఉండేవాడు. ఇదే క్రమంలో సమీపంలోని స్పిన్నింగ్ మిల్లులో పనిచేస్తున్న సోన్‌కాంబ్లే అశ్వినితో పరిచయం ఏర్పడింది. ఇది అక్రమ సంబంధానికి దారి తీసినట్లు తెలుస్తోంది. కాగా అశ్విని భర్త రమేశ్ ట్రాక్టర్‌పై కూలిగా పని చేస్తూ కుటుంబాన్ని పోషిస్తున్నాడు. వీరికి కుమారుడు లోకేష్ (8), కూతురు సునాక్షి (4)ఉన్నారు. అయితే గత శుక్రవారం రహమాన్ తన అన్నకు చెందిన స్కూటీపై అశ్వినిని తీసుకొని సీతాగోంది మీదుగా గర్కంపేట వైపు వెళ్లాడు. ఈ దృశ్యాలు సీతాగోంది పంచాయతీ సీసీ కెమెరాల్లో రికార్డయ్యాయి. వారు ఇంటికి రాకపోగా హత్యకు గురవడం ఇరుకుటుంబాలను కలచివేసింది.

జిల్లా కేంద్రంలో ఉద్రిక్తత

ఆదిలాబాద్: మృతదేహాలను రిమ్స్‌కు తరలించగా ఇరు కుటుంబాలు, బంధువులు, సన్నిహితులు అక్కడికి చేరుకున్నారు. ఉద్రిక్త పరిస్థితుల నేపథ్యంలో పోలీసులు పటిష్ట బందోబస్తు ఏర్పాటు చేశారు. మృతులకు సంబంధించిన కాలనీల్లో ఎలాంటి అవాంఛనీయ ఘటనలు జరగకుండా పోలీసులు పర్యవేక్షిస్తున్నారు. పోస్టుమార్టం అనంతరం అంత్యక్రియల నిమిత్తం ఇరుకుటుంబాలకు మృతదేహాలను అప్పగించారు.

రోడ్డు ప్రమాదంలో రిటైర్డ్ కార్మికుడి మృతి

రామకృష్ణాపూర్: రోడ్డు ప్రమాదంలో ఊరు రామకృష్ణాపూర్‌కు చెందిన సింగరేణి రిటైర్డ్ కార్మికుడు కొల్లూరి రాజయ్య(60) మృతి చెందాడు. బైక్‌పై మంచిర్యాలకు వెళ్లి తిరిగి ఇంటికి వెళ్తుండగా క్యాతనపల్లి క్రాస్ రోడ్డు వద్ద ఎదురుగా వచ్చిన ఓ కారు వేగంగా ఢీకొట్టడంతో తలకు బలమైన గాయాలయ్యాయి. 108 లో వెంటనే మంచిర్యాల ప్రభుత్వాసుపత్రికి తరలించగా అప్పటికే మృతిచెందా డు. ఎస్సై అశోక్ కేసు న మోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు.

హోరాహోరీగా కిక్ బాక్సింగ్ పోటీలు



ప్రారంభిస్తున్న జిల్లా అధ్యక్షుడు హరికృష్ణ

మంచిర్యాలక్రైం: మంచిర్యాల జిల్లా కేంద్రంలో ఈ నెల 29న ప్రారంభమైన తెలంగాణ రాష్ట్ర స్థాయి కిక్ బాక్సింగ్ పోటీలు రెండో రోజులుగా హోరాహోరీగా కొనసాగుతున్నాయి. రెండోరోజు కిక్ బాక్సింగ్ పోటీలను జిల్లా అధ్యక్షుడు సుదమల్ల హరికృష్ణ, రాష్ట్ర అధ్యక్షుడు రామాంజనేయులు ప్రారంభించారు. స్థానిక ఎఫ్‌సీఏ ఫంక్షన్‌హాల్ నిర్వహిస్తున్న ఈ పోటీలకు తెలంగాణ రాష్ట్రంలోని అన్నీ జిల్లాల నుంచి సుమారు 1000 మంది క్రీడాకారులు హాజరయ్యారు. అనంతరం ఒలంపిక్ అసోసియేషన్ తరుపున అబ్జర్వర్‌గా వచ్చిన వివేక్‌ను కిక్ బాక్సింగ్ జిల్లా అసోసియేషన్ తరుపున ఘనంగా సన్మానించారు.

















సీఎంకు శుభాకాంక్షల వెల్లువ

హైదరాబాద్‌లో నూతన సచివాలయం ప్రారంభోత్సవం సందర్భంగా సీఎం కేసీఆర్‌ను మంచిర్యాల, ఆసిఫాబాద్ జిల్లాలోని ఎమ్మెల్యేలు మర్యాదపూర్వకంగా కలిశారు. పుష్ప గుచ్ఛాలు అందజేసి శుభాకాంక్షలు తెలియజేశారు.